
నీకు నేనున్నా ...
అంగులూరి అంజనీదేవి

# నీకు నేనున్నా...

అంగులూరి అంజనీదేవి



# నీకు నేనున్నా...

సాయంత్రం నాలుగు గంటలకి పది నిముషాలు మాత్రమే తక్కువ. మనోహర్ ఇంకా రెడీ కాలేదు. జాగు చేస్తుంటే ఒకసారి వాళ్ళ నాన్నగారొచ్చి మందలించి, పనిమీద బయటకెళ్లారు. మనోహర్ మాత్రం బస్‌కి టైం అవుతున్నా ఇంకా రెడీ కాలేదు.

"ఏమిట్రా మనోహర్! ఇంతాలస్యం. ఇంకా రెడీ కాలేదు. సర్దుకోలేదు. మీ నాన్నగారు బస్‌కి టైం అయిందని తొందరచేసి బయటకెళ్లారు. మళ్ళీ వచ్చే సరికి నువ్విలాగే వుంటే ఏమంటారో ఏమో త్వరగా కానివ్వురా" అంటూ తొందర చేసింది మనోహర్ తల్లి తులశమ్మ.

"చూడమ్మా! నీ మనుమరాలు పద్మ ఏం చేసిందో. దానికి ఈ మధ్యన పొగరు ఎక్కువైంది. నేను ఈ రోజు హైదరాబాదు వెళ్తున్నాను కదా! కాస్త నా బట్టలు సర్దివ్వకూడదూ! అవసరం లేనప్పుడు వచ్చి అవీ, ఇవీ సర్దుతుంది. ఇప్పుడేమో కన్పించదు. అదీకాక ఈ మధ్యన అహం కూడా ఎక్కువైందిలే" అంటూ చిన్న పిల్లాడిలా అటూ, ఇటూ తిరగసాగాడు.

"ఇంతకీ ఏమిట్రా నీ ఏడుపు? దానిమీద కోప్పడతావు దేనికి? చూడు! మనోహర్! ఇంత వాడివయ్యావనే కాని జాగ్రత్త అనేది బొత్తిగా లేదురా నీకు. ఉదయం నుండి ఏం చేశావు? కాస్త సర్దిపెట్టుకొని వుంటే మీనాన్న గారు ఇప్పుడు కోప్పడేవారు కాదుగా. ఇక ఆయనకు కోపం వస్తే తగ్గటం కష్టం. ఇప్పటికే కాలేజి తెరిచి నాలుగు రోజులు అయిందని కోపంగా వున్నారు" అంటూ మనోహర్‌కి సహాయం చెయ్యబోయింది తులశమ్మ.

"అమ్మా! ఇక్కడ నువ్వు హెల్ప్ చెయ్యటం మొదలు పెట్టావంటే ఆ బస్ కాస్త మిస్ అయి ఈరోజు కూడా వుండిపోవలసి వస్తుంది. పద్మను పిలువు. త్వరగా సర్దేస్తుంది. అదీకాక ఇంతకముందే ఇక్కడికి వచ్చి నేను వెళ్తాననేమో నా సూట్‌కేస్ తాళాలు కొట్టేసింది. ఇప్పుడు నన్నేం చెయ్యమంటావ్! అందుకే త్వరగా పిలువమ్మా!" అంటూ బ్రతిమాలాడు మనోహర్.

"నేను పిలవనురా! అది నీ దగ్గరకు రావటానికి వీల్లేదు".

"ఎందుకు లేదు?" మనోహర్ అడిగాడు.

"నీ భార్యనుకున్నావా? లేక ఇంతకు ముందున్న చిన్న పిల్లనుకున్నావా?" తెచ్చిపెట్టుకొన్న కోపం కన్పించింది తులశమ్మ ముఖంలో.

"అవేమీ అనుకోవట్లేదు. పద్మ నా అక్కయ్య కూతురు. నిరభ్యంతరంగా ఇక్కడకు రావొచ్చు, పోవచ్చు" అన్నాడు మనోహర్.

"రావొచ్చు, పోవచ్చురా. దానికి నేను కాదనలేదు. పద్మ నీ అక్కయ్య కూతురే కాదు. నీ కాబోయే భార్యకూడా. కానీ మీ బావ కరుణాకర్ ఇప్పుడే బ్యాంకు నుండి వచ్చి ఇంట్లో వున్నాడు. అది ఇప్పుడెలావస్తుంది" అంది చిన్నస్వరంతో తులశమ్మ.

మనోహర్‌కి బావంటే భయం. గౌరవం. అక్కయ్యంటే అభిమానం. అక్కయ్య కూతురు పద్మంటే చనువు.

"అలాగైతే నేనే వెళ్తాను" అన్నాడు మొండిగా.

"బావ ఇప్పుడు ఇంట్లో వున్నట్లు అక్కయ్య చెప్పింది. ఒకేసారి వెళ్లేటప్పుడు చెప్పి వెళ్దుగాన్లే"

"అమ్మమ్మా! మామయ్య ఎక్కడ? అరె! వెళ్లిపోయారా! సూట్‌కేస్ తాళాలు నా దగ్గరే వున్నాయి. ఇప్పుడెలా?" అంటూ కంగారుపడ్తూ వచ్చింది పద్మ.

అంతవరకు తల్లితో మాట్లాడుతున్న మనోహర్ చనువుగా పద్మ దగ్గరకెళ్లి తాళాలు లాక్కున్నాడు.

పద్మ ఎవరోకాదు. మనోహర్‌కి స్వయానా అక్కయ్య కూతురు. పుట్టినప్పుడే ఆ ఇద్దర్ని భార్యా, భర్తలుగా నిర్ణయించారు పెద్దవాళ్లు. కానీ ఆ ఇద్దరు కలసి

మెలసి తిరుగుతుంటే ఎవరన్నా చూస్తే బావుండదని పెద్దవాళ్ల ఆలోచన. అందుకే వాళ్లకి త్వరగా పెళ్లి చెయ్యాలని పెద్దవాళ్ల ఆరాటం. కానీ మనోహర్ చదువింకా పూర్తి కాలేదు.

పద్మ నాన్న కరుణాకర్. స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసర్. అదే ఊరిలో ఇల్లుకట్టుకొని స్థిరపడిపోయారు. ఆయనకు ఒక్కగానొక్క కొడుకు రవి. బి.ఏ. చదువుతున్నాడు. పద్మను ఏడవ తరగతి చదివించి సరిపెట్టారు. తర్వాత రాణి ఆఖరమ్మాయి. ఎనిమిదవ తరగతి చదువుతోంది.

పద్మ గురించి కరుణాకర్, పార్వతి ఆలోచించరు. ఆ అమ్మాయి బరువు, బాధ్యతలు వాళ్ల తాతయ్య మాధవయ్యకే వదిలేశారు. పద్మ కూడా ఎక్కువగా వాళ్ల తాతయ్య గారింట్లోనే గడుపుతుంది. మాధవయ్య గారింట్లో కళకళ లాడుతూ తిరిగేది తన కూతురు పార్వతి పిల్లలే. ఇద్దరు కొడుకులకి పెళ్లిళ్లు చేశారు మాధవయ్య. వాళ్లు ఉద్యోగరీత్యా చెరొక వూరువెళ్లిపోయారు. ఇక మిగిలింది మనోహర్. ఆ అబ్బాయి సెలవులకి మాత్రమే ఇంట్లో వుంటాడు. కాలేజీ వున్న టైంలో హైదరాబాదులో వుంటాడు.

పద్మ, రాణి రావడంతో క్షణాల మీద రెడీ అయ్యాడు మనోహర్. ఈ లోపల తను హైదరాబాదు వెళ్తున్నట్లు అక్కయ్య, బావలతో చెప్పివచ్చాడు.

“మావయ్యా! మీరు బాగా చదవాలి” అంది రాణి.

“మీ అక్కయ్య కంటే నువ్వే నయం రాణి! చదువుపై శ్రద్ధ చూపుతావు. మీ అక్కయ్య నేను వెళ్తానని తెలిస్తే చాలు, అవసరమైనవి దాచి నన్ను ఇబ్బంది పెడ్తుంది” అంటూ పక్కనే వున్న పద్మవైపు చూశాడు మనోహర్.

మనోహర్ వైపు చిలిపిగా చూస్తూ మల్లెపువ్వులా నవ్వింది పద్మ. పద్మ అందం విరిసీవిరియని పద్మం. పెద్ద కళ్ళు, కోటేరులాంటి ముక్కు, విశాలమైన నుదురు, ఆ నుదురుపై స్ప్రింగులాగ పడిలేచే నల్లటి ముంగురులు. నిగ నిగ లాడే మేని రంగు. అందంలో తక్కువేం కాదు పద్మ. కాకపోతే మనిషి కాస్త పొట్టిగా వుంటుంది. ఆ పొట్టి పెద్ద లోపంలా కన్పించదు. ఏ పార్టుకాపార్టు పరిశీలిస్తే పద్మ అందగత్తెనే చెప్పాలి. ఈ మధ్యన ఆ అమ్మాయిలో వయసుతో బాటు ఒక విధమైన చైతన్యం వచ్చింది. కానీ వయసుకి తగినంతగా మనసు ఎదగలేదు.

4

ఎప్పుడు చూసినా లేడిపిల్లలా గంతులేస్తుంటుంది. మనోహర్‌తో మాట్లాడటం కన్నా పోట్లాడటమే ఎక్కువగా చేస్తుంటుంది పద్మ.

"అమ్మా! వెళ్లొస్తాను" అంటూ తల్లితో చెప్పాడు మనోహర్.

"వెళ్లొస్తాను పద్మా!" అంటూ బయటకు నడిచాడు.

అంతలోపలే బయటకెళ్లిన మాదవయ్య వచ్చాడు. ఇద్దరు కలిసి బస్టాండ్‌కి వెళ్లారు.

బస్ వచ్చింది. చాలామంది ఎక్కుతున్నారు. మనోహర్ కూడా ఎక్కాడు.

"జాగ్రత్త బాబు! బజార్లవెంట తిరక్కుండా సినిమాలు ఎక్కువగా చూడకుండా, కడుపులో భయం పెట్టుకొని చదువు" అంటూ చిన్నపిల్లాడికి చెప్పినట్లు జాగ్రత్తలు చెప్పాడు మాదవయ్య.

"నా గురించేమీ బాధపడకండి నాన్నా! నేను జాగ్రత్తగా చదువు కుంటాను" అంటూ లోపలకెళ్లి కూర్చున్నాడు మనోహర్.

"ఏం మాదవయ్యా! అబ్బాయిని చదువుకు పంపుతున్నావా?" అంటూ ఓ పెద్దమనిషి మాదవయ్యకి దగ్గరగా నిలబడ్డాడు.

"ఆఁ... ఆఁ.... అబ్బాయిని బస్ ఎక్కించి వెళ్దామని వచ్చాను. ఇంతకీ మీ తూర్పు మాగాణిలో వరి నాటినట్లున్నారు. కాస్త ముళ్లకంచె వేయించండి. లేకుంటే పశువుల బెడద ఎక్కువ. ఇదిగో నా మాటవిని మీ మెట్టపొలంలో పొగాకు పెట్టించవయ్యా దిగుబడి బాగుంటుంది" అంటూ వచ్చిన వ్యక్తికి సలహా ఇచ్చాడు మాదవయ్య.

"నా కమతం... దెబ్బ తినింది మాదవయ్యా. ఖర్చులు భరించలేక పోతున్నాను. ఆర్థికలోటు ఎక్కువైంది. పొలమున్నా సాగు చేయించే శక్తి వుండాలిగా. ఇప్పుడు చూడు, ఎరువులు, మందులు లేక వరిపైరు చీడపట్టింది. ఇంకా పొలం చుట్టూ కంచె వేయించాలంటే మాటలా! నేనిచ్చే కూలికి పనివాళ్లు దొరకటం లేదు. ఆరోడ్డు పక్క పొలాన్ని ఎందుకు కొన్నానా అని బాధపడ్తున్నాను. నీకేం అన్ని వసతులు వున్నాయి. చేతినిండా డబ్బుంది. నీలాగ పైరుని పెంచాలంటే

మావల్లకాదు" అంటున్న అవతల వ్యక్తి ఒకప్పుడు ఆ ఊరిలో పెద్ద రైతుగా పేరు తెచ్చుకున్నాడు. ఇప్పుడు మాత్రం బాధల్లో వున్నాడు. జాలిగాచూశాడు మాదవయ్య.

మాదవయ్య మాత్రం జీతగాండ్లను పెట్టి, అందరికన్నా పైచేయిగా తన పొలాన్ని పండిస్తున్నాడు.

మనోహర్ ఎక్కిన బస్ కదిలింది. కన్పించినంత వరకు బస్ వైపు చూస్తూ, ఇంటివైపు కదిలాడు మాదవయ్య.

* * *

హైదరాబాదులో బస్ దిగి తనరూంకెళ్లాడు మనోహర్. కృష్ణతో కలిసి, రూంలో కూర్చుని చదువుకుంటున్న హరిని చూడగానే మనోహర్ కనుబొమలు ముడిపడ్డాయి. హరిది హైదరాబాదే. ఇంట్లో వీలుకాదని ఫ్రెండ్స్ రూముల్లో వుండి చదువుకుంటుంటాడు. కృష్ణా, మనోహర్ క్లోజ్ ఫ్రెండ్స్. చాలాకాలంగా ఒకే రూంలో వుండి చదువుకుంటున్నారు. వాళ్లంతా ఏ.జి.బి.యస్.సి. రెండవ సంవత్సరం చదువుతున్నారు.

"కృష్ణా! హరి మన రూంలో వుంటే మనకి ఇబ్బంది అవుతుందిరా! ఇప్పటికే ఈ ఒక్కరూంలో ఇరుగ్గా వుంది మన ఇద్దరికి. ఫ్రీగా తిరగలేకపోతున్నాం. ఇందులో మూడో వ్యక్తి కూడా వుంటే ఇక మనం చదువుకోలేం" అంటూ కృష్ణను పక్కకు పిలిచి చెప్పాడు మనోహర్.

"వేరే ఇల్లు చూశాను మనోహర్! ఇల్లు చాలా పెద్దగా వుంది. మనతో బాటు ఇంకో ఇద్దరు వుండైనా చదువుకోవచ్చు. అద్దె కూడా తక్కువగానే ఉంది.

"ఇప్పుడు మనం ఈ రూం మారటం అవసరం అంటావా?"

"హరి కోసం తప్పదు మరి"

"హరికి రామకృష్ణ రూంలో బాగానే వుంది కదా!"

"రామకృష్ణ ఫ్రెండ్‌కి, హరికి గొడవ అయిందట. అందుకే హరి ఇకపై వాళ్ల దగ్గర వుండనంటున్నాడు. ఎంతయినా హరి మన క్లాస్‌మేట్ కదా! మనం ఆ మాత్రం ఆదుకోలేకపోతే ఎలా చెప్పు.

"సరే! నీ ఇష్టం" అన్నాడు మనోహర్.

# 6

వెంటనే వేరే ఇంటికి మారారు మనోహర్, కృష్ణ, హరి. ఆ ఇల్లు వాళ్లకి బాగా నచ్చింది. స్టూడెంట్స్ వుండి చదువుకోవటానికి ఆ ఇంట్లో అన్ని సౌకర్యాలు వున్నాయి. అద్దెకూడా ముగ్గురు కలిసి ఇస్తారు కాబట్టి తక్కువగానే అన్పించింది. ముఖ్యంగా ఆ ఇంటి వాతావరణం డీసెంట్‌గా వుంది మనోహర్‌కి.

డబ్బు విషయంలో దిగులు పడనవసరం లేదు మనోహర్. ఆలోచించి ఖర్చు పెట్టుకోవలసిన అవసరం అంతకన్నా లేదు. ఎందుకంటే వాళ్ల అన్నయ్యలకి మనోహరంటే వల్లమాలిన అభిమానం. తండ్రి పంపే డబ్బుకాక అన్నయ్యలు కూడా పంపుతుంటారు. అందుకే మనోహర్‌కి ఎలాంటి బాధలు లేవు. శ్రద్ధగా చదువుకొని, మంచి మార్కులతో పాసవ్వటమే ఆ అబ్బాయి ప్రస్తుత కర్తవ్యం.

ఉదయాన్నే స్నానం చేసి, శ్రీ ఆంజనేయస్వామి దండకం చదవటం పూర్తి కాగానే, డ్రస్ వేసుకుంటుండగా వాళ్ల ఫ్రెండ్ హరి వచ్చాడు.

“ఒరే! మనోహర్! మన పక్క ఇంట్లో ఎవరో కాపురం వుంటున్నార్రా! మంచి, మంచి అమ్మాయిలు కన్పిస్తున్నారు” అంటూ లోపల కొచ్చాడు హరి. ఎప్పుడైనా హరి అమ్మాయిలంటే పడిచస్తాడు. అమ్మాయి లెక్కడ కన్పించినా ముఖం వాచిన వాడిలా వాళ్లనే చూస్తూ నిలబడ్తాడు.

ఆ ఇల్లు చూడటానికి వచ్చిన రోజు హరి రాలేదు. అందుకే ఇల్లు గల వాళ్లు తమ పక్కనే వుంటున్నారన్న విషయం హరికి తెలియదు. మనోహర్‌కి తెలుసు. కానీ ఆ ఇంట్లో వున్న వాళ్లందరిని మనోహర్ చూడలేదు.

“ఉదయాన్నే బలే జోక్ మోసుకొచ్చావు హరీ! కాపురాలుండక కాకరకాయలుంటాయా?” అంటూ తను వేసుకున్న డ్రస్‌నోసారి సరిచేసుకుంటూ అద్దం ముందు నిలబడ్డాడు మనోహర్. ఇప్పుడిప్పుడే యవ్వనాన్ని సంతరించు కుంటున్న మనోహర్ శరీరం అందంగా, ఆరోగ్యంగా వుంది.

డార్క్ మెరూన్ కలర్ షర్ట్ – క్రీం కలర్ పాంట్ వేసుకొని అద్దం ముందు నిలబడివున్న మనోహర్‌కి వెనగ్గా నిలబడి కళ్లార్పకుండా మనోహర్‌నే చూస్తున్నాడు హరి. మనోహర్ ఏ డ్రస్ వేసుకున్నా ఆ డ్రస్‌కే ఓ ప్రత్యేకత వస్తుంది. అదే డ్రస్ తను వేసుకుంటే ఏం బాగా లేదనిపిస్తుంది. అదే బాధగా వుంది హరికి.

7

కాలేజీలో కూడా అమ్మాయిలంతా మనోహర్‌నే చూస్తుంటారు. మనోహర్ వాళ్లవైపు చూడకపోయినా – ఎప్పుడో ఒకప్పుడు తమవైపు చూడకపోతాడా అన్నట్లుగా మనోహర్‌ని దొంగ చూపులు చూసే అమ్మాయిలే ఎక్కువగా వున్నారు. హరిని ఒక్క అమ్మాయి కూడా చూడదు. హరికి వాళ్లను చూసి, చూసి కళ్ల నొప్పులే మిగులుతున్నాయి. అదే కడుపుమంటగా వుంది హరికి. నలుగురిలో వున్నప్పుడు కూడా కులాసాగా కబుర్లు చెబుతూ సరదాగా నవ్వుతూ, నవ్వించే మనోహర్‌ని చూస్తుంటే హరి మనసు యింకా ఎక్కువగా వుడికిపోతూ వుంటుంది. ఎంతమందిలో నిలబడినా మనోహరే ప్రత్యేకంగా కన్పించటం హరికి ఇబ్బందిగా వుంది. ఆ ప్రత్యేకతేమిటో తెలిసికోవాలని అలాగే మనోహర్‌ని చూస్తూ మనోహర్ వెనకాలే నిలబడ్డాడు హరి.

తనవైపే చూస్తూ, తన వెనకాల నిలబడ్డ హరిని అద్దంలోంచి గమనించి తిరిగి చూశాడు మనోహర్. అప్పుడే ఏదో గుర్తుకి వచ్చిన వాడిలా అక్కడ నుండి వెళ్లిపోయాడు హరి.

రెడీ అయ్యాడు మనోహర్. బయటకెళ్లాలని వాకిట్లోకి రాగానే ఎప్పుడూ కన్పించని తేజస్సేదో కన్పించినట్లైంది మనోహర్‌కి. అది కలలో కూడా మనోహర్ వూహించని తేజస్సు. ఆ తేజస్సు – ఉదయభానుని లేతకిరణంలా తళుక్కున మెరిసి మనోహర్ గుండెలోని అతి సున్నితమైన భాగాలను నులివెచ్చగా తాకింది. ఆ నులివెచ్చని లేతకిరణం పేరు మధురిమ.

మధురిమ గుమ్మం ముందు అందంగా ముగ్గులను తీర్చిదిద్దుతూ కన్పించింది. ఆ అమ్మాయి ఒంగి ముగ్గు వేస్తుంటే మనోహర్ చూసింది ఒక్కసారే అయినా చాలా పరిశీలనగా చూశాడు. ఒక అమ్మాయిని అలా పరిశీలనగా చూడటం మనోహర్‌కి ఇదే మొదటిసారి.

చీరతో ఆ అమ్మాయి నడుం చుట్టబడిందే కాని అసలు నడుం వుందో లేదోనన్న అనుమానం కల్గింది. పలుచనైన ఆ చీరలో అక్కడక్కడ మధురిమ పచ్చని మేనిఛ్చాయ స్పష్టంగా కన్పిస్తోంది. పవిట కొంగును స్ట్రైట్‌గా బిగించి జాగ్రత్తను వ్యక్తం చేసిందే కాని అందాలను దాచలేకపోయింది. ముగ్గుపై చక్కగా తిరిగే ఆ సుతిమెత్తని చేయిని అలాగే చూడాలనిపించింది మనోహర్‌కి. అలా

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2080**

* * *